నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్ నారాయణపేట

10 | మహబూబ్‌నగర్, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

కూరగాయల ధరలు..

కూరగాయ	కిలో (కేజీ)
టమాట	రూ.80
వంకాయ	రూ.60
బెండకాయలు	రూ.60
మిరపకాయలు	రూ.50
గోకరకాయ	రూ.60
బీరకాయ	రూ.50
చిక్కుడుకాయ	రూ.60
క్యాలీఫ్లవర్	రూ.40
క్యారెట్	రూ.50
ఉల్లిగడ్డ	రూ.60

నిత్యావసరాలు

కందిపప్పు	రూ.170
శనగపప్పు	రూ.110
సన్‌ఫ్లవర్ నూనె	రూ.140
పామాయిల్	రూ.90
బియ్యం	రూ.1,500 (25 కిలోలు)



ధరల దడ

పండగ పూట పరేషాన్

- భగ్గుమంటున్న కూరగాయలు
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు
- మాటవిననంటున్న టమాట.. ఘాటెక్కిన ఉల్లి
- కిలో రూ.180తో అందనంటున్న కందిపప్పు
- దిగుమతుల్లేక మార్కెట్‌లో పెరుగుతున్న రేట్లు
- నియంత్రించడంలో అధికారులు విఫలం

దసరా పండుగ వేళ ధరలు దడ పుట్టిస్తున్నాయి. కూరగాయల రేట్లు కాక రేపుతుండగా.. నిత్యావసరాలు ఆకాశాన్నంటుతున్నాయి. టమాట కిలో రూ.80కి చేరి మాట వినననంటున్నది. ఉల్లి ధరలు కూడా రూ.60కి చేరి కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. కందిపప్పు కిలో రూ.180కి చేరి సామాన్యులకు అందనంటూ.. పేద, మధ్య తరగతికి శరాఘాతంగా మారింది. దీంతో పేదల ఇండ్లల్లో పండుగ భారంగా మారింది. దిగుమతులు తగ్గిపోవడంతో మార్కెట్లల్లో రేట్లు విపరీతంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

- నాగర్‌కర్నూల్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ)

కూరగాయలు, నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొన్ని నెలలుగా వీటి ధరలు తగ్గినట్లే తగ్గి రియల్ వ్యాపార రంగంలో మాదిరిగా మళ్లీ ఎప్పటి ధరకు చేరుకుం టున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుం బాలు పస్తులుం డాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నలు గైదుగురిని మించి ఉండే కుటుంబాల్లో రోజులు దినదినగండంగా మారాయి. టమాట ధర మోత మోగిస్తున్నది. ఏకంగా రూ.80కి చేరుకోవడం గమనార్హం. గతంలో రూ.100 దాటిన ఈ ధర రెండు నెలల కిందట తగ్గిపోగా తిరిగి సెంచరీకి సమీపిస్తున్నది. దీనివల్ల కొన లేం.. తినలేక పోతున్నామంటూ సామాన్యులు వాపోతున్నారు.

పండుగ వేళ.. ధరల మోత

ప్రస్తుతం దసరా పండుగ సీజన్ కావడంతో ధరలు మోత మోగిస్తున్నాయి. ఎంతకీ తగ్గక పోవడంతో సామాన్యులు ఆందోళ చెందుతున్నారు. పండుగకు ఇండ్లకు సున్నాలు, రంగులు వేసుకోవడం, ఇతరచిన్న చిన్న సామాగ్రి కొను గోలు చేయడం.. ముఖ్యంగా కొత్త బట్టలు కొనడం సహజం. ఈ క్రమంలో ఆ వస్తువులు, బట్టల సంగతలా ఉంచితే.. కనీసం పండుగ పూట కడుపునిండా తిన లేని స్థితిలో పెరిగిన ధరలు తలమీద బరు వూ మారాయి. చికెన్, మటన్ ఏమోగానీ కనీసం పప్పన్నం కూడా తిన లేని విధంగా పరిస్థితి తయారైందని వాపోతున్నారు. కంది పప్పు కిలో రూ.170 నుంచి రూ.180 చేరింది. కిలో టమాట రూ.80కి చేరింది. చికెన్ కిలో ధర రూ.230కి అటు ఇటుగా ఉండగా.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మటన్ కిలో రూ.800 చొప్పున ఉంది. పప్పు, టమాట, మాంసం ధరలు ఇలా ఉంటే మిగిలిన ఆకు కూరలు, ఇతర సరుకుల ధరలు సైతం అందని ద్రాక్షగా మారాయి. జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌లో ఏ కూరగాయలు చూసినా దాదా పుగా కిలో రూ.60 చొప్పున ధర ఉంటుంది. బజారుకు వెళ్లే ప్రజలకు పావుకిలో రూ.20, అర్ధ కిలో రూ.40, కిలో రూ.60 అంటూ వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. దీనివల్ల చిన్న కుటుంబీకులు, పేదలకు ఏ కూరగాయలు, ఎంత పరిమాణంలో కొనాలో తెలియక అందో ళన చెందుతున్నారు. పెద్ద కుటుంబాల్లోని ప్రజలైతే ఎక్కువగా తక్కువ ధర పలికే దొండకాయ, బెండకాయలను కొను గోలు చేస్తున్నారు. ఇక ఆకు కూరల పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. గతంలో రూ.20కి 5 చొప్పున పాల కూర, తోటకూర, పుంటికూర, ఇతర ఆకు కూరల కట్టలను విక్రయించే వ్యాపారులు ఇప్పుడు రూ.20కి ఒక కట్ట చొప్పున అమ్ముతున్నారు. దీంతో ఆకు కూరలు చాలా మంది కొనడం లేదు. హోల్‌సేల్ నుంచి తీసుకొచ్చిన ధరలకు, రైతుల నుంచి కొన్న ధరలకు అదనంగా పెంచి వ్యాపారం చేస్తున్నారు. దీంతో పండుగ పూట ధరలు బెంబేలెత్తిస్తున్నాయి.

వంట నూనెలు సలసల

వంట నూనెల ధరలు సలసల కాగుతున్నాయి. దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచడంతో కంపెనీలు ధరలను అమాంతం పెంచేశాయి. దీంతో కేవలం రెండు వారాల వ్యవ ధిలోనే లీటర్ నూనెపై రూ.20 నుంచి రూ.30 వరకు ధర పెరిగింది. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ధర రూ.130, పామాయిల్ లీటర్ ధర రూ.125కు చేరింది. దీంతో సామాన్యుడిపై భారం పడింది. దేశీయంగా తయారయ్యే సోయాబీన్, వేరు శగ, రైస్‌బ్రాన్ ఆయిల్ ధరలు విదేశీ ఉత్పత్తులతో సమానంగా ధరలు పెంచారు. గత నెల ఇదే సమయానికి రైస్‌బ్రాన్ లీటర్ ధర రూ.115 నుంచి రూ.120 వరకు ఉండగా.. నెల రోజుల్లో అంటే ప్రస్తుతం రూ.135 మార్క్‌ను దాటింది. ఇక పల్లీ ఆయిల్ విషయానికొస్తే రూ.170 నుంచి రూ.180 వరకు ధర మార్కెట్‌లో ఉన్నది. దిగుమతి సుంకం పరి ధిలోకి రాని దేశీయ నూనెల ధరలను సైతం పెంచడంతో సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు.

పాలమూరు యూనివర్సిటీ ప్రధాన ముఖద్వారం

పీయూకు వీసీ జాడేదీ?

- మే నెలా ఖరులోనే ముగిసిన గడువు
- నాలుగు నెలలుగా ఇన్‌చార్జితోనే సరి
- రెగ్యులర్ వీసీ లేక నిర్ణయాల్లో జాప్యం
- అదిగో.. ఇదిగో అంటున్న సర్కారు
- 74 పోస్టులు ఖాళీ.. భర్తీ చేసే వారెరీ?
- ఇలాగైతే న్యాక్ గ్రేడ్ తగ్గే అవకాశాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 10 : పాలమూరు విశ్వవిద్యాలయం.. ఆచార్యులు లేక వెలవెలబోతున్నది. బోధన, బోధ నేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నా.. వాటి భర్తీకి ప్రజాపాలన ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీ, ఔట్ సోర్సింగ్ సిబ్బందితోనే నెటుకొస్తుండడంతో ఉన్నత విద్యలో నాణ్యత కొరవ డుతున్నది. మే 21వ తేదీన పీయూ వైస్ చాన్స్‌లర్ పదవి గడువు ముసిగింది. ఈ క్రమంలో ఇన్‌చార్జి వీసీగా రాష్ట్ర ప్రణా ళిక విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్(ఐఏఎస్)ను నియ మించారు. అయితే, నాలుగు నెలలుగా ఆయన ఒక్కరోజు కూడా వర్సిటీకి రాలేదు. ప్రభుత్వ శాఖల పనుల నిర్వహణలో తీరిక లేకపోవడంతో ఈ సమస్య ఎదుర వుతున్నట్లు తెలుస్తున్నది. చిన్న సంతకం అవసర మైనా, ప్రతిపాదనల ఆమోదాని కైనా పీయూ సిబ్బంది హైదరాబా డుకు వెళ్లాల్సి వస్తున్నది. యూనివర్సిటీలో అత్యంత కీలక మైన వీసీ పోస్టుకు నాలుగు నెలలుగా రెగ్యులర్ వ్యక్తి లేక పోవడంతో పరి పాలనాపరమైన విషయాల్లో వేగవంతంగా నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. దీంతో బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిగో.. అదిగో వీసీ వస్తున్నారని ప్రభుత్వం ఊరడింపు ప్రకటన తోనేసరి పుచ్చుతున్నది.

3న ముగిసిన సెర్చ్ కమిటీ సమావేశం..

పీయూ 6వ వీసీగా మే 22, 2021న ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాం తో థోడ్‌బాధ్యతలు స్వీకరించారు. మూడేండ్ల పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగిసింది. అయితే, ఆయన గడువు కంటే ముందే కొత్త వీసీల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచే కసరత్తు చేపట్టింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నేప థ్యంలో 159 దర ఖాస్తులు రాగా.. అభ్యర్థుల గురించి ఇంటెలిజెన్స్ వర్గాల తో ప్రభుత్వం సమా చారాన్ని సేకరించింది. మే నెలా ఖరు నాటికి కొత్త వీసీలను నియమిస్తామని సర్కారు ప్రకటించింది. యూనివర్సిటీ పాలక మండలి, రాష్ట్ర ప్రభుత్వం, యూజీసీ నామినీ.. ఇలా ముగ్గురు సభ్యులుగా ఈ నెల 3వ తేదీన దర ఖాస్తుదారుల బయో డేటాలను సెర్చ్ కమిటీ పరిశీలించి.. వీసీ నియామకానికి మూడేసి పేర్లు సూచించింది. అన్వేషణ పూర్తయి వారం గడుస్తున్నా.. నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నది.

ఇవీ డిమాండ్లు..

పీయూలో పనిచేస్తున్న బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పలు రకాలైన డిమాండ్లు చేస్తున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ పేరిట వసూలు చేస్తున్న అధిక ఫీజులను తగ్గించాలి. వాటిని రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి. అదనపు తరగతి గదులు (ఈవీఎస్, తెలుగు, ఎంసీఏ) నిర్మించాలి. ఎంటీఎఫ్, ఆర్ టీఫ్‌తో సంబంధం లేకుండా సర్టిఫికెట్లు ఇవ్వాలి. అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలి. లా, ఇంజినీరింగ్ కళా శాలలను పీయూలోనే కొన సాగించాలి. ఏటా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలి. బాలికల వసతి గృహాలు అందుబా టులోకి తీసుకురావాలి. బోధనేతర సిబ్బందికి 12 శాతం వేతన పెంపు చేప ట్టాలి. వీసీ లేకపోవడంతో ఇలాంటి అనేక రకాలైన విధానపరమైన, అభివృద్ధి పనుల నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతున్నది. సమస్యలు పరి ష్కారం కావడం లేదు.

భర్తీ కాని పోస్టులు..

యూనివర్సిటీలో అన్ని విభాగాల్లో కలిపి 95 మంది ఆచార్యులకుగానూ 21 మంది మాత్రమే ఉన్నారు. 13 ఆచార్యులు, 20 సహ ఆచార్యులు, 41 సహాయ ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు పీయూకు అనుబంధంగా ఉన్న జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలోని పీజీ సెంటర్లలో కూడా ఆచార్యుల పోస్టులను భర్తీ చేయడం లేదు. పీయూలో రూ.8 కోట్లకు పైగా వెచ్చించి సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసినా.. అథ్లెటిక్ కోచ్ లేక పోవడంతో వృథాగా మారింది.

గడువు తీరిన న్యాక్ గుర్తింపు..

పీయూకు న్యాక్ 'బి' గ్రేడ్ గుర్తింపు ఉండగా.. నవంబర్ 2023లోనే కాలపరిమితి ముగిసింది. మళ్లీ గుర్తింపు కోసం పీయూ ఇటీవల న్యాక్ కమిటీకి సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ (ఎస్ఎస్ఆర్) సమర్పించింది. దీంతో త్వరలోనే న్యాక్ బృందం పర్య టించనున్నది. ఈ క్రమంలో పీయూకి వీసీ లేరు. న్యాక్ గ్రేడ్ కేటా యింపే దశ సిలబస్, బోధన, పరి శోధనలు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న ప్రోత్సాహం, పరిపాలన, ఉత్తమ విధానాల అమలు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. బోధన సిబ్బంది కూడా తక్కువగా ఉండడంతో న్యాక్ ఏ స్థాయి గ్రేడ్ వస్తుందో లేదో అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఇప్పటివరకు వీసీలు ఇలా..

25 జూలై 2008 నుంచి 24 జూలై 2011 వరకు వి.గోపాల్‌రెడ్డి, 25 జూలై 2011 నుంచి 24 ఏప్రిల్ 2012 వరకు కట్టా నర్సిం హారెడ్డి, 24 ఏప్రిల్ 2012 నుంచి 25 జూలై 2016 వరకు జీ భాగ్యనారాయణ, 25 జూలై 2016 నుంచి 24 జూలై 2019 వరకు బీ రాజారత్నం, 25 జూలై 2019 నుంచి 21 మే 2021 వరకు రాహుల్ బొజ్జా, 22 మే 2021 నుంచి 21 మే 2024 వరకు లక్ష్మీకాంత్ రాథోడ్ పీయూ వీసీలుగా కొనసాగారు. ప్రస్తుతం అహ్మద్ నదీం ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం..



ఇన్‌చార్జి వీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ఫోన్‌లో అహ్మద్ నదీంను సంప్రదించి నిర్ణయం తీసుకుంటున్నాం. శాశ్వత వీసీ త్వరలో వచ్చే అవకాశం ఉన్నది.

- డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పాలమూరు యూనివర్సిటీ



పొలాల్లో మొసలి కలకలం

పెబ్బేరు, అక్టోబర్ 10 : పంట పొలాల్లో మొసలి కలకలం రేపిన ఘటన శ్రీరంగా పుం మండలంలో గురువారం చోటు చేసుకున్నది. నాగ సానిప ల్లిలోని నర సిం హానాయుడు రైతు వరి పొలంలో మొసలి కని పించింది. గ్రామస్తులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు అప్పగిం చారు. వ్యవసాయ పొలాల మధ్యనున్న జూరాల ప్రధాన ఎడమ కాల్వ నుంచి మొసలి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సంబురంగా సద్దుల బతుకమ్మ

సంప్రదాయానికి ప్రతీక.. : చిట్టెం

మక్తల్, అక్టోబర్ 10 : తెలంగాణ సంస్కృతి, సంప్ర దాయానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కృష్ణ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం చేప ట్టిన సద్దుల బతుకమ్మ వేడుకలకు చిట్టెం హాజరై మాట్లాడారు. కేసీఆర్ హయాంలో బతుకమ్మ పండుగకు దేశ విదేశాల్లో ఎంతో ఖ్యాతిని తీసుకొ చ్చారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వేడుకలను నామమాత్రంగా నిర్వహిస్తున్నదన్నారు. అనంతరం బతుకమ్మలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్య క్రమంలో నాయ కులు శివరాజ్ పాటిల్, శివప్ప, రామకృష్ణ, అమర్ దీక్షిత్, ఈశ్వర్‌యాదవ్ ఉన్నారు.

కృష్ణలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

జోగుళాంబ, శ్రీశైలం ఆలయాల్లో మహాగౌరిగా దర్శనమిస్తున్న అమ్మవారు

మహాగౌరీ.. నమోస్తుతే..

అలం పుల్, అక్టోబర్ 10 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జోగుళాంబ ఆలయంలోని గర్భాలయం ఎదుట అమ్మవారు మహా గౌరిదేవీగా భక్తులకు దర్శన మిచ్చారు. యాగశాలలో చండీహోమాలు, రథోత్సవం నిర్వహించారు. అలాగే పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, కంచి కామాక్షి, యోగ నార సిం హస్వామి ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు చేసినట్లు ఆలయ ఈవో పురేందర్‌కుమార్, పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆల యాన్ని విద్యుద్దీపాలతో అలంకరిం చారు.

నందివాహనంపై మల్లన్న దంపతులు

శ్రీశైలం, అక్టోబర్ 10 : శ్రీశైలంలో భ్రామరీ అమ్మవారు మహాగౌరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. నందిని వాహనంగా చేసు కొని నాలుగు చేతుల్లో వర, అభయ ముద్రల తోపాటుత్రిశూలం, ఢమరుకాన్ని ఆయుధాలుగా ధరించి దివ్యకాంతులను ప్రసరింపజేస్తూ తెల్లని రంగులో శాంతస్వరూపిణిగా కరుణించారు. నందివాహనంపై ఆసీనులైన స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. పురవీధుల్లో గ్రామోత్సవంలో విహరిం చారు.

పేదలకు అండగా కల్యాణలక్ష్మి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, అక్టోబర్ 10 : పేదింటి ఆడ బిడ్డలకు అండగా నిలిచేం దుకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి ఎందరికో ఆపన్న హస్తం అందించారని అలం పుల్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండవెల్లి, మానవపాడు, ఎర్రవల్లి, ఇటిక్యాల మండ లాలకు చెందిన 178 మందికి చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారురాలికి కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

పోస్టుమాస్టర్ సస్పెన్షన్

- రైతు ఫిర్యాదుతో అధికారుల విచారణ
- ఆలూరులో 1,200 పోస్టులు పెండిం గ్‌లో ఉన్నట్లు గుర్తింపు

గట్టు, అక్టోబర్ 10 : వచ్చిన పోస్టులన్నీ తన వద్దే ఉంచుకొని పోస్టుమాస్టర్ ఇబ్బం దులకు గురిచేస్తున్నాడని మండలంలోని ఆలూరుకు చెందిన పోస్ట్ మాస్టర్‌పై ఓ రైతు ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేశాడు. పాస్‌బుక్‌లు, ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు ఇలా పోస్ట్‌కు వచ్చిన వాటిని విని యోగ దారులకు ఇవ్వడం లేదని తెలి పాడు. ఈ విషయమై గురువారం జిల్లా పోస్టల్ అధికారి విజయ జ్యోతి గ్రామానికి చేరు కొని విచారణ చేప ట్టారు. దాదాపు 1,200 పోస్ట్‌లు పోస్ట్‌మాస్టర్ వద్దే ఉన్నట్లు గుర్తించారు. నెలల తరబడి పంపిణీ చేయకపోవడంతో పోస్ట్‌మాస్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వెల్దండ బీఎంసీయూలో నిరసన తెలుపుతున్న పాడి రైతులు

పండుగ పూట పస్తులేనా?

వెల్దండ, అక్టోబర్ 10 : పండుగ పూట పస్తులుండాల్సిం దేనా..? అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని విజయ డెయిరీ పాల శీతలీకరణ కేంద్రం (బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్) వద్ద నిరసన తెలియజేశారు. నాలుగు నెలలుగా పాల బిల్లులు పెండిం గ్‌లో ఉన్నాయని, రాత్రనకా.. పగలనకా.. కష్టపడి పని చేసి పాలు పోస్తే బిల్లులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవులకు, గేదెలకు పశుగ్రాసం కొన లేక అప్పుల పాల వుతున్నామని వాపోయారు. దసరా పండుగ పూట కొత్త బట్టలు కొనలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కనీసం పాల డెయిరీ కేంద్రంలో నిల్వ ఉన్న రూ.2 లక్షలను ఇప్పిం చాలని బీఎంసీయూ అధికారి కృష్ణయ్యను కోరారు. స్పందించిన ఆయన ఉన్న తాధికారులతో మాట్లా డతానని చెప్పడంతో ఆందోళన విరమిం చారు. కార్యక్రమంలో రైతులు రాఘవరెడ్డి, వెంకట్‌రెడ్డి, జంగయ్య, పర్వతాలు, అయ్యన్న, యాద గిరి, రాంరెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

క్రాప్‌లోన్ కట్టాల్సిందే..

- బ్యాంక్ నుంచి రైతులకు నోటీసులు

నోటీసును చూపెడుతున్న పార్వతమ్మ

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 10 : రుణమాఫీ చేశామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ సర్కారు పండుగ పూట అసలు, వడ్డీ కట్టాలంటూ నోటీసులు పంపించడంతో రైతులు ఖంగుతిన్నారు. మండలంలోని సింగారం గ్రామ రైతులకు బ్యాంక్ అధికారులు క్రాప్ లోన్‌తోపాటు వడ్డీని చెల్లించాలని నోటీసులు పంపారు. గెనమోని జంగయ్య 2023 ఏప్రిల్ 27న ఏపీజీవీబీలో రూ.లక్షా 60 వేల రుణం తీసుకున్నాడు. ఈ బకాయి 2024 సెప్టెంబర్ 13 నాటికి రూ.6,032.11 వడ్డీ వేశారు. దీనికితోడు ఏడాది పైబడిందని 14 శాతం వడ్డీ విధిస్తూ అసలు, వడ్డీ మొత్తం కట్టాలని నోటీసు పంపించారు. అలాగే అదే గ్రామంలో ఉడుత పార్వతమ్మ, నీలం వెంకటయ్యకు సైతం బ్యాంక్ ద్వారా నోటీసులు వచ్చాయి. రుణమాఫీ అంటూ ప్రభుత్వం ప్రగల్భాలు పలికి చివరకు వడ్డీకి వడ్డీలు కట్టించుకుంటూ నిండా ముంచిందని రైతులు మండిపడుతున్నారు. ఈ విషయమై బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సురేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సంవత్సరం గడువు తీరిన రైతులకు అప్పుతో పాటు వడ్డీ కలిపి చెల్లించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు పంపించామన్నారు. రూ.2లక్షలలోపు మాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాధికారులను కలిసి ఫిర్యాదు చేయాలన్నారు. అంతకుపైగా అప్పు ఉన్న వారు వాటిని చెల్లిస్తే రూ.2 లక్షల మాఫీ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

JAYAPRAKASH NARAYAN COLLEGE OF ENGINEERING
(Approved by AICTE, Affiliated to JNTU Hyderabad)
Accredited by NAAC | UGC Autonomous Institution
Dharmapur, Mahabubnagar - 509 001, Telangana

ప్రముఖ రాజకీయ, సామాజిక కార్యకర్త, అణచివేతకు వ్యతిరేకంగా మహోన్నత పోరాటానికి అంకురార్పణ చేసిన యోధుడు, లోక్ నాయక్, భారత రత్న
శ్రీ జయప్రకాష్ నారాయణ గారి
జయంతి మరియు దసరా శుభాకాంక్షలు
11/10/1902 - 8/10/1979

Courses offered :
Polytechnic, B.Tech., M.Tech., PhD (R&D), MBA, MCA
Counselling Code : JPNE
8886680001 to 25
www.jpnce.ac.in

Sri K.S. Ravi Kumar
Chairman